క్లుప్తంగా

భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: విద్యార్థులకు భోజనం అందించే విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఇంద్రానగర్ బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల భోజనానికి వినియోగించే కూరగాయలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టాకు రిజిస్టరు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

షాబాద్: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో అదే పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయురాలు దుర్గాభవానీ పాఠశాల అభివృద్ధికి రూ.40వేల నగదును విరాళంగా హెచ్‌ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నార న్నారు. విద్యార్థులు బావిభారత నిర్మాతలని, వారి ఉజ్వల భవిష్యత్‌కు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న కరుణాకర్

కేశంపేట: తెలంగాణ ఉద్యమంలో లెక్చరర్ల ఫోరం తరపున ఉద్యమాలు చేసిన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కరుణాకర్‌కు షాద్‌నగర్ మార్కెట్ కమిటీలో డైరెక్టర్‌గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల షాద్‌నగర్ మార్కెట్ కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో కరుణాకర్‌కు డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు. కరుణాకర్ ప్రస్తుతం లెక్చరర్ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ విషయమై ఉద్యమకారులు ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీలో అవకాశం కల్పించడంపై కరుణాకర్ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకర్‌కు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ



మాజీ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: చర్లపల్లి జైలులో ఉన్న కొండగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం కలిశారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇంట్లో కొద్దిసేపు బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ చర్చించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.పట్నం నరేందర్‌రెడ్డిని త్వరలో జైలులో నుంచి విడుదలయ్యే విధంగా కృషి చేయాలని కోరారు.

పశువైద్య శిబిరం

మొయినాబాద్‌రూరల్: మూగజీవాల ఆరోగ్యంపై పాడిరైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి దేవీరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువులకు చుడి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్.. ప్రాణానికే ముప్పు

యువతకు అవగాహన తప్పనిసరి

- పోలీసులకు దొరికితే భారీగా జరిమానా
- చిన్నపిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దంటున్న పోలీసులు



షాబాద్‌లో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు

షాబాద్: యువత క్రేజ్‌గా బైక్ రైడింగ్ చేస్తుంటారు. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్‌తోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. మైనర్లు సైతం వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు బైక్‌లు ఇచ్చే ముందు ఒకసారి ఆలోచించాలని నిపుణులు పేర్కొంటున్నారు. కొంతమంది కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మైనార్టీలు కూడా బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారు. ట్రిపుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమని, పట్టుబడితే జైలుకు వెళ్లడం ఖాయమని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

లైసెన్స్ లేకున్నా..

మండలంలో స్పీడ్ బైక్‌లు పరుగులు పెడుతున్నాయి. యువత చేతిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా వాహనాల మీద రయ్.. రయ్ మంటూ తిరుగుతున్నారు. అంతేకాకుండా మైనర్లు, యువతీ యువకులు ముగ్గురికి మించి బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. బైక్‌పై వెళ్లడానికి ఇద్దరికే అనుమతి ఉంది. పరిమితికి మించి ప్రయాణిస్తే అదుపుతప్పి కిందపడితే ప్రాణాలకే ప్రమాదమని పోలీసులు హెచ్చరిస్తున్నా యువత బైక్ నడపాలన్న సరదా పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బైక్‌లు ఇవ్వొద్దని ఆర్టీఏ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి సరదా తీర్చడానికి తల్లిదండ్రులు బైక్‌లిచ్చి ప్రమాదాలపాలు చేయొద్దని సూచిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులకు తెలియకుండా బైక్‌లు డ్రైవ్ చేస్తుంటారు. ఇలాంటి వారిపై నిఘా పెట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి



బైక్‌పై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించే విషయంలో యువత బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా ప్రమాదాలు ట్రిపుల్ రైడింగ్‌తోనే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాగే డ్రైవింగ్‌లో ఫోన్ మాట్లాడే వారిపై, బైక్ రేసింగ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటే ట్రిపుల్ రైడింగ్, మైనర్లు బైక్ నడపడం వంటివి నివారించొచ్చు.

– పీసరి సతీశ్‌రెడ్డి, టీఎల్ఎఫ్ జిల్లా లీగల్ అడ్వైజర్

పోలీసులకు దొరికితే కేసులు



ట్రిపుల్ రైడింగ్‌లో ఎవరూ దొరికినా వారిపై కేసులు పెట్టి భారీగా జరిమానా విధిస్తున్నాం. తల్లిదండ్రులు స్వయంగా తమ పిల్లలతో కలిసి కౌన్సెలింగ్‌కు వస్తే అవగాహన కల్పిస్తాం. ఇలా చేయడంతో పిల్లల్లో మార్పు వస్తుంది. ట్రిపుల్ రైడింగ్ జోలికి వెళ్లరు. రెండుసార్లు ట్రిపుల్ రైడింగ్‌లో దొరికితే లైసెన్స్ రద్దుకు సిఫారస్ చేయడంతో పాటు జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటాం.

– కాంతారెడ్డి, సీఐ, షాబాద్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. శనివారం ఆమె కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్‌లు ప్రణాళికా ప్రకారం గ్రామాలను సందర్శించి వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు సరైన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. శిశువులకు సమయం ప్రకారం వ్యాక్సినేషన్ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమృత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ మంజుల, పీహెచ్ఎన్ లుదియా, ఎంపీహెచ్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు



వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి

చేవెళ్ల/శంకర్‌పల్లి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు కోరారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ వెంకయ్య అధ్యక్షతన వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్‌లలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీలలో గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని, ఆపరేషన్‌లు లేకుండా నార్మల్ డెలివరీలు చేసేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ సంఖ్యను పెంచాలన్నారు. చలికాలం కావటంతో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతుందని, దీంతో ప్రజలకు జ్వరాలు ఇతర అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. దీనిని గుర్తించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిల్లో కావాల్సిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యులు రేవతి, శ్రీనివాస్, అనూష, ప్రశాంతి, రఘు, సుష్మ, రేష్మ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీలకు ఆహ్వానం



సినీహీరో సుమన్‌కు ఆహ్వాన ప్రతిక అందజేస్తున్న సాయినాథ్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ శనివారం యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ మాస్టర్ సాయినాథ్‌యాదవ్ సినీహీరో సుమన్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు, గ్రాండ్ మాస్టర్ మల్లేశ్‌యాదవ్ స్మారకార్థం జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించనున్నట్లు మాస్టర్ పేర్కొన్నారు. ఈ జాతీయస్థాయి పోటీలను 2025 జనవరి 6న పట్టణంలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని సినీహీరో సుమన్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ నరేందర్‌నాయక్, మాస్టర్లు ఉత్తేజ్, వినయ్, శివకుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు అందరూ సహకరించాలి

- ఎంపీడీఓ సంధ్య



అజీజ్‌నగర్‌లో కుటుంబ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలంలో శనివారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 17,799 ఇళ్లను గుర్తించామని, అందులో ఇప్పటివరకు 16,900 పైబడి ఇళ్లను సర్వే చేటపట్టినట్లు తెలిపారు. మండలంలో 99 శాతం సర్వే పూర్తయిందన్నారు. కుటుంబ సర్వేలో వివరాలు ఇవ్వనివారు ఆయా గ్రామాలకు సంబంధించిన అధికారులను కలిసి త్వరగా తెలియజేయాలని ఆమె కోరారు. గ్రామాల్లో ఇంకా సర్వే కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ రహమాన్, అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అరుణ్‌కుమార్‌గౌడ్, అజీజ్‌నగర్ పంచాయతీ కార్యదర్శి జెమిల్ రహమాన్, పీఏఓ మనీలా, కారోబార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నియామకం



చల్లా భరత్‌కు నియామకపత్రం అందజేస్తున్న ప్రదీప్‌కుమార్, తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని బీసీ మహాసభ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ మహాసభ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పట్టణానికి చెందిన చల్లా భరత్‌ను నియమించారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు బీసీల అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తానని చల్లాభరత్ పేర్కొన్నారు. బాధ్యతలను అప్పగించేందుకు కృషి చేసిన బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధక్షుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం చల్లా భరత్‌కు వారు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నవీన్, మహేశ్, నిఖిల్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మండల హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఏఎన్ఎం

మొయినాబాద్‌రూరల్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామాల్లో ప్రజలకు అనేక విధాలుగా చికిత్సలు నిర్వహిస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల, బాకారం సబ్‌సెంటర్ డాక్టర్ దినేశ్‌గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏఎన్ఎం భారతి ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్, పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొని వ్యాక్సినేషన్, పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు చిన్నారులకు వ్యాక్సిన్, పోలీయో చుక్కలు వేశారు.

కోర్టు సమస్యలపై సర్వే

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం గ్రామస్తులు ఎదుర్కొంటున్న కోర్టు సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలంలోని భాస్కరా లా కళాశాల విద్యార్థుల బృందం గ్రామానికి చెరుకొని ఇంటింటికీ తిరిగి కోర్టు సమస్యలు ఏమైనా ఉన్నాయా, వారికి ఏమైనీ న్యాయ సహాయం కావాలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రొఫెసర్ స్నేహలత మాట్లాడుతూ.. గ్రామస్తుల ద్వారా సేకరించిన సమస్యల పరిష్కారానికి ఏవిధంగా ముందుకు వెళ్లాలనే విషయమై వచ్చే నెలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత న్యాయ శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన




మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, సభ్యులు

షాద్‌నగర్: రైతుల సంక్షేమానికి పాలక మండలి సభ్యులందరం సమష్టిగా కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం సరికొత్త పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతో తమకు మంచి పదవులు లభించాయన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా తాము ముందుకు కొనసాగుతామన్నారు. ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తామన్నారు. వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ... షాద్‌నగర్ మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ మార్కెట్‌గా ఏర్పాటు చేస్తామని, మార్కెట్ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 27న షాద్‌నగర్ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ సభ్యులు బాలశౌరెడ్డి, కొర్ర రవి, చాకలి నర్సింలు, కరుణాకర్, వెంకట్ నర్సింహారెడ్డి, జానంపేట సురేశ్, మల్లయ్య, భాస్కర్‌గౌడ్, పంది వెంకట్‌రెడ్డి, భరత్, కక్కునూరి సందీప్‌కుమార్, తాటిశెట్టి నవీన్ కుమార్, దామోదర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వేరో ఫౌండర్ జన్మదిన వేడుకలు

షాబాద్: గురుకుల పాఠశాలల అభివృద్ధికి స్వేరో ఫౌండర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంతో కృషి చేశారని సీనియర్ స్వేరో శ్రీశైలం పేర్కొన్నారు. మండల కేంద్రంలో స్వేరో ఫౌండర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్థాపించిన స్వేరోస్ నెట్‌వర్క్ సోషల్ వెల్ఫేర్ పూర్వ విద్యార్థులతో మొదలై గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయస్థాయి వరకు వ్యాపించి, కుల, మతాలకతీతంగా అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే సిద్ధాంతంతో పనిచేస్తూ యువతలో గుణాత్మకమైన మార్పును తీసుకొస్తుందన్నారు. మాములు వ్యక్తి నుంచి యూనివర్సిటీ దాక ఎదిగిన మహోన్నతమైన వ్యక్తి ప్రవీణ్‌కుమార్ అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, బైండ్ల స్వామి, దోస్వాడ రాంబాబు, జంగయ్య, జాంగిర్, నర్సింహ, రాజు, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: తిమ్మాపూర్ 11కేవీ సబ్‌స్టేషన్‌లో పలు మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలివేయబడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్, ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధి, నందిగామ మండలంలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఈ అంతరాయానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు కార్తీక వనభోజనాలు



దేవాలయం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్: ఎలికట్ట భవనమ్మ దేవాలయంలో విద్యార్థులకు కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు శిశుమందిర్ ప్రధానాచార్యుడు నాగరాజు అన్నారు. శనివారం షాద్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట భవనమ్మ దేవాలయంలో కార్తీకమాసం పరమ పవిత్రమాసం కావడంతో విద్యార్థులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్రమ శిక్షణతో నడుచుకున్నప్పుడే తమ భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయని జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జోగిన్‌పల్లి బీఆర్ వృత్తి విద్యా కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యతో ఉన్నత విద్యలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్‌మూర్తి, ఈవెంట్ ఇన్‌చార్జి పి.వి.రమేశ్, ప్రభాకర్, అబ్దుల్ రహీం, రాంరెడ్డి, శేషగిరి, ప్రసాద్, గోవర్ధన్, గాయత్రి, జోత్స్న, ఎల్‌వీరెడ్డి, శ్రీనివాస్, పి.వి.రమేశ్, రాజారెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- తహసీల్దార్ అజాంఅలీ



పాపిరెడ్డిగూడలో బీఎల్‌ఓల నుంచి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

కేశంపేట: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు జీపీ కార్యాలయల వద్ద అందుబాటులో ఉండి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేట గ్రామాల్లో తహసీల్దార్ అజాంఅలీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఫారం 6లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 7లో, సవరణలకు, మార్పులు, చేర్పులకు, దివ్యాంగులుగా గుర్తించేందుకు ఫారం 8లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు, సవరణలు చేసుకోవాలి

చేవెళ్ల: ఓటరు నమోదు కోసం చేపట్టిన రెండు రోజుల ప్రత్యేక క్యాంపెయిన్ శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతీ గ్రామంలో ఉన్న బూత్ లెవల్ అధికారులు బూత్ స్థాయిలో ఈ ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు. కొత్తగా 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ కృష్ణయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమం ఆదివారం కూడా అన్ని గ్రామాల్లో కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు ఓటరు నమోదు, సవరణలు చేసుకోవాలని కోరారు.